సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 22 । సెప్టెంబర్ । 2024



నలుగురి అరెస్ట్

హష్ ఆయిల్ విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. రూ. 21 లక్షల విలువ చేసే ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు. 8లో▸



సమస్యలు పరిష్కరించండి

వ్యవసాయ విస్తరణ అధికారుల సమస్యలను పరిష్కరించాలని ఏఈఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభుత్వాన్ని కోరారు. 8లో▸



అక్రమనిర్మాణాల కూల్చివేత

అక్రమ నిర్మాణాలపై గండిపేట రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. జేసీబీతో పలు నిర్మాణాలను కూల్చివేశారు. 8లో▸

న్యూస్‌రీల్

స్థానికులకే మార్కెట్ పదవి ఇవ్వాలి

ఆమనగల్లు: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి మండలానికి చెందిన నాయకులకే ఇవ్వాలని కాంగ్రెస్ మండల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం ఆ పార్టీ నాయకులు ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవిని, కడ్తాల్ ప్రాంతానికి చెందిన వారికి ఇవ్వనున్నట్లు ప్రచారం జరుగుతుందని పేర్కొన్నారు. ఇది మంచిది కాదని, ఇదే విషయాన్ని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లి, స్థానికులకే ఇవ్వాలని కోరనున్నట్లు పేర్కొన్నారు.

అయ్యప్ప దీక్ష పవిత్రమైనది



పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న అర్చకుడు రంగరాజన్

మొయినాబాద్: అయప్ప దీక్ష ఎంతో పవిత్రమైనదని చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్ అన్నారు. చిలుకూరు నుంచి శబరిమలకు అక్టోబర్ 18న ప్రారంభించనున్న శ్రీహనుమత్ ధ్వజ మహా పాదయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. కార్తీక మాసంలో 41 రోజుల పాటు కఠోరంగా అయ్యప్ప దీక్ష చేపట్టడం, పాదయాత్రగా శబరిమలకు వెళ్లడం సాహసోపేత నిర్ణయమని చెప్పారు. కార్యక్రమంలో విజయభార్గవరెడ్డి, కుమ్మరి శివశంకర్, అర్చకులు సురేష్, భక్తులు ఉమాశంకర్‌రెడ్డి, రాంచదర్, మురళి, మహేందర్ యాదవ్, సహదేవ్‌గౌడ్, నర్సిహ్మగౌడ్, వెంకటేశ్ యాదవ్, ప్రవీణ్, సిద్దు, ప్రశాంత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుడి ప్రాణం నిలిపి..
సీపీఆర్ చేసిన కండక్టర్, డ్రైవర్



ఎండీ సజ్జనార్‌తో కండక్టర్, డ్రైవర్

జీడిమెట్ల: బస్సులో గుండెపోటు వచ్చిన ప్రయాణికుడికి సీపీఆర్ చేసి ఆస్పత్రికి తరలించిన కండక్టర్, డ్రైవర్‌ను టీఎస్‌ఆర్‌టీసీ యాజమాన్యం అభినందించింది. వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు జీడిమెట్ల డిపోనకు చెందిన బస్సు.. బాలానగర్ నుంచి జీడిమెట్ల వైపు వెళ్తోంది. ఐడీపీఎల్ వద్ద రామకృష్ణ(67) అనే ప్రయాణికుడు రన్నింగ్ బస్సు ఎక్కాడు. బస్సు గణేశ్ నగర్ బస్టాప్ దాటగానే ఆయనకు గుండెపోటు వచ్చి, బస్సులోనే కుప్పకూలిపోయాడు. విషయాన్ని కండక్టర్ అంజలి.. డ్రైవర్ సైదులుకు చెప్పగానే బస్సును పక్కకు ఆపాడు. ప్రయాణికుడిని మిగతా ప్రయాణికుల సహాయంతో కిందకు దింపి కండక్టర్ ప్రయాణికుడికి సీపీఆర్ చేశారు. మరో ప్రయాణికుడు ఇందుకు సహకరించాడు. దీంతో రామకృష్ణ కోలుకోగా..అతడిని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. ప్రయాణికుడు సేఫ్‌గానే ఉన్నాడని డాక్టర్లు తెలిపారు. సమయస్ఫూర్తితో ప్రయాణికుడి ప్రాణం కాపాడిన కండక్టర్, డ్రైవర్‌ను ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రత్యేకంగా అభినందించారు. డిపో మేనేజర్ ఆంజనేయులుతో సహ వారిని శనివారం బస్‌భవన్‌కు పిలిపించి శాలువాతో సత్కరించారు.

జీఎంఆర్ ఎయిర్‌పోర్టుకు మరో గుర్తింపు



శంషాబాద్: న్యూస్‌వీక్ నిర్వహించిన 'ప్రపంచ అత్యంత విశ్వసనీయ కంపెనీలు- 2024' సర్వేలో ట్రాన్స్‌పోర్టు, లాజిస్టిక్, ప్యాకేజింగ్ కేటగిరిలో ప్రపంచ వ్యాప్తంగా ఐదో స్థానంలో జీఎంఆర్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ కంపెనీ నిలిచిందని జీఎంఆర్ వర్గాలు ఓ ప్రకటనలో వెల్లడించాయి. ప్రపంచ అత్యంత విశ్వసనీయ సంస్థల్లో గుర్తింపు పొందిన జాబితాలో భారత దేశం నుంచి విమానాశ్రయ అభివృద్ధి సంస్థ ఆపరేటర్‌గా ఉన్న జీఎంఆర్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ స్థానాన్ని దక్కించుకోవడం హర్షణీయమని చైర్మన్ జీబీఎస్ రాజు అన్నారు. విమానాశ్రయాల మౌలిక సదుపాయాలు, ప్రయాణికుల సౌలభ్యం, పర్యావరణ హితమైన చర్యలతో తమ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా టాప్ 5 స్థానంలో గుర్తింపు పొందిందన్నారు. వివిధ కేటగిరీల్లో 1000 కంపెనీలపై నిర్వహించిన సర్వేల్లో జీఎంఆర్ సంస్థ టాప్ ర్యాంకింగ్‌లో ఉండడం తమ సంస్థ బాధ్యతాయుతమైన పనితీరుకు నిదర్శనంగా ఉందన్నారు.



విస్తరణకు నోచుకోని హైదరాబాద్-బీజాపూర్ రహదారి

కదలని హైవే!

అవాంతరాలు తొలగినా ముందుకు సాగని పనులు

- రెండేళ్ల క్రితమే కేంద్ర మంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన
- నిధులు విడుదల.. 90శాతం భూసేకరణ పూర్తి
- కార్యరూపం దాల్చని నేతల హామీలు

చేవెళ్ల: జాతీయ రహదారి-164 విస్తరణ పనులు కలగానే మిగిలిపోతున్నాయి. హైదరాబాద్- బీజాపూర్ రోడ్డు నిర్మాణ పనులకు రెండేళ్ల క్రితం కేంద్ర మంత్రి శంకుస్థాపన చేసి, నిధులు మంజూరు చేశారు. 90శాతానికి పైగా భూసేకరణ పూర్తయింది. అయినప్పటికీ పనులకు ముహూర్తం ఖరారు కావడం లేదు. గ్రీన్ ట్రిబ్యునల్ కేసులు అంటూ గత ప్రభుత్వం కాలయాపన చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం అవాంతరాలు తొలిగాయని, గ్రీన్ ట్రిబ్యునల్ నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిందని, ఇక పనులు ప్రారంభించటమే తరువాయి అని ప్రజాప్రతినిధులు ప్రకటించారు. ఇదే విషయాన్ని ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సైతం స్పష్టంచేశారు. ఇప్పటికీ కార్యరూపం దాల్చడం లేదని ప్రాంత ప్రజలు వాపోతున్నారు.

రూ.928.41కోట్లతో..

టీఎస్‌పీఏ జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు రవాణా అవసరాల రీత్యా.. జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా చేయాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. అందులో భాగంగా 2022 ఏప్రిల్ 29న రోడ్లు రవాణా, రహదారుల శాఖ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పనులకు శంకుస్థాపన చేశారు. సుమారు 46 కిలోమీటర్ల పొడవున్న ఈ మార్గంలో చేవెళ్ల, మొయినాబాద్ వద్ద రెండు బైపాస్ రోడ్లు, 18 అండర్‌పాస్‌లు ఉన్నాయి. అందుకు అవసరమైన నిధులు రూ.928.41కోట్లు విడుదల చేసింది. నిర్మాణ బాధ్యతలను మెగా ఇంజినీరింగ్ కన్‌స్ట్రక్షన్ సంస్థ దక్కించుకుంది. రోడ్డు విస్తరణకు 145.42 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉండగా.. 90శాతం సేకరణ పూర్తయింది.

మృత్యు రహదారి

నేషనల్ హైవేపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. రాష్ట్ర రాజధానికి చేరువుగా ఉండటంతో వ్యవసాయ క్షేత్రాలు, అనంతగిరి అందాలు, కోట్‌పల్లి ప్రాజెక్టులను వీక్షించేందుకు వీకెండ్‌లో పర్యాటకులు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు చిన్నదిగా ఉండటంతో తరచూ ట్రాఫిక్ జాం ఏర్పడటంతో పాటు ప్రమాదాలు చోటుచేసుకుంటాయి. ఏటా 60- 70 మంది మృత్యువాత పడుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వారి నియోజకవర్గాలకు ఇదే మార్గంలో వెళ్తారు. వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల ప్రజలకు ఇదే ప్రధాన రహదారి కావడంతో విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టాలని కోరుతున్నారు.

రోడ్డు విస్తరణ అనివార్యం



హైదరాబాద్- బీజాపూర్ రహదారి విస్తరణ పనులు అనివార్యం. ఈ మార్గంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. రోడ్డు చిన్నదిగా ఉండటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాఫిక్ జాం అవుతోంది. రహదారిని విస్తరిస్తే కష్టాలు తీరుతాయి.

– భూపాల్ శ్రీధర్, సీఐ, చేవెళ్ల

కల సాకారం కాబోతోంది



రోడ్డు విస్తరణ కోసం ఎన్‌హెచ్ ఉన్నతాధికారులను తరచూ కలుస్తున్నాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సీఎం కార్యదర్శి, ఐఎఫ్‌ఎస్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి.. రోడ్డు పనులు పూర్తిచేయించేందుకు కృషి చేస్తున్నారు. త్వరలో ప్రజల కల సాకారం కాబోతోంది.

– సత్యనారాయణరెడ్డి, పీసీబీ మెంబర్

వారం రోజుల్లో ప్రారంభిస్తాం

హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులకు అడ్డంకులు తొలిగాయి. ఇక పనులు ప్రారంభించడమే తరువాయి. అంతర్గతంగా సర్వే చేస్తున్నారు. వారం రోజుల్లో మొయినాబాద్, చేవెళ్ల ప్రాంతంలో నిర్మాణ పనులు షురూ చేస్తాం. త్వరలోనే పూర్తవుతుంది.

– శరత్, నేషనల్ హైవే అథారిటీ సైట్ ఇంజినీర్

మున్సిపాలిటీకి సర్వం సిద్ధం

- ప్రభుత్వ నిర్ణయమే తరువాయి
- సిద్ధంగా ఉన్న ప్రతిపాదనలు
- ఎదురు చూస్తున్న చేవెళ్ల నియోజకవర్గ ప్రజలు
- వ్యతిరేకిస్తున్న విలీన గ్రామస్తులు

చేవెళ్ల: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చేవెళ్ల మున్సిపాలిటీ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. అందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలుస్తోంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పురపాలిక ఏర్పాటుకు సిద్ధం చేసిన నివేదికలు సంబంధిత ఉన్నతాధికులకు పంపించినప్పటికీ.. స్పందన కొరవడింది. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరగా.. పురపాలిక ఏర్పాటుకు కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం. ప్రభుత్వం మారినా.. ప్రతిపాదనలు పంపించిన కాలె యాదయ్య ఎమ్మెల్యేగా కొనసాగుతుండటంతో పురపాలిక ఏర్పాటు లాంఛనప్రాయమేనని స్థానికులు భావిస్తున్నారు. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రావటమే తరువాయిగా పేర్కొంటున్నారు.

పలు గ్రామాల విలీనం

అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలతో పాటు హెడ్‌క్వార్టర్‌గా ఉన్న చేవెళ్ల మాత్రం గ్రామ పంచాయతీగానే కొనసాగుతోంది. ఫలితంగా అభివృద్ధిలో వెనుకబాటుకు గురవుతోంది. ఈ నేపథ్యంలో చేవెళ్ల మున్సిపాలిటీ ఏర్పాటు డిమాండ్ ఊపందుకుంది. అందుకు సరిపడా జనాభా కోసం పట్టణం చుట్టూ ఉన్న 10 గ్రామాలను ఇందులో విలీనం చేయనున్నారు. చేవెళ్ల, కేసారం, ఊరేళ్ల, ఇబ్రహీంపల్లి, దామరగిద్ద, దేవునిఎర్రవల్లి, మల్లారెడ్డిగూడ, పామెన, కందవాడ, రామన్న గూడ, కందవాడ, పలుగుట్ట, మల్కాపూర్ గ్రా మాలను చేవెళ్లలో కలపనున్నట్లు సమాచారం.

మారిస్తే మహర్దశ

చేవెళ్లను మున్సిపాలిటీగా మారిస్తే శరవేగంగా అభివృద్ధి చెందనుంది. అధికార వికేంద్రీకరణ జరగనుంది. కొత్తగా శానిటేషన్, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, అకౌంటెన్సీ, పట్టణ విస్తరణ, పబ్లిక్ హెల్త్, ఆహార భద్రత విభాగాలు ఏర్పడనున్నాయి. ఉద్యోగులు పెరుగుతారు. రోడ్లు, వీధి దీపాలు తదితర మౌలిక సౌకర్యాలు సమకూరుతాయి. పన్నుల రూపంలో నిధులు ఎక్కువగా వస్తాయి. ఇదిలా ఉండగా.. చేవెళ్లను మున్సిపాలిటీగా మారిస్తే మంచిదే కానీ.. తమ గ్రామాలను విలీనం చేయడానికి వీలులేదని ఆయా ప్రాంతాల ప్రజలు చెప్పడం గమనార్హం.

నివేదికలు సిద్ధంగా ఉన్నాయి..



ప్రాంత ప్రజల కోరిక మేరకు చేవెళ్లను మున్సిపాలిటీగా మార్చేందుకు కృషి చేస్తున్నా. అందులో భాగంగానే గత ప్రభుత్వానికి నివేదిక సమర్పించా. నియోజకవర్గంలోని శంకర్‌పల్లితో పాటు చేవెళ్ల కూడా మున్సిపాలిటీగా మారాల్సి ఉండేది. కొన్ని కారణాలతో ఆలస్యమైంది. నివేదికలు సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వం నిర్ణయమే తరువాయి.

– కాలె యాదయ్య, ఎమ్మెల్యే, చేవెళ్ల



చేవెళ్ల మండల ముఖచిత్రం

25లోపు నివేదిక ఇవ్వండి

- కలెక్టర్, సీపీకి జాతీయ ఎస్టీ కమిషన్ నోటీసులు
- ఎల్మినేడు అసైన్డ్ భూ బాధితుల ఫిర్యాదుకు స్పందన

ఇబ్రహీంపట్నం రూరల్: ఎల్మినేడు భూ బాధితుల విషయంలో ఈనెల 25లోపు సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్ శశాంక, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబును జాతీయ ఎస్టీ కమిషన్ ఆదేశించింది. ఇబ్రహీంపట్నం మండలం ఎల్మినేడు గ్రామంలో ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం అసైన్డ్ భూములను సేకరించింది. బాధితులకు సరైన పరిహారం ఇవ్వకుండా అన్యాయం చేశారని, కొంతమందికి ఇప్పటికీ పరిహారం అందలేదని.. గత జూన్ 26న ఎల్మినేడు అసైన్డ్ భూ బాధితుల సంఘం అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌రెడ్డి జాతీయ ఎస్టీ కమిషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇదే విషయమై సదరు రైతులు హైకోర్టును సైతం ఆశ్రయించారు. అయినప్పటికీ న్యాయం జరగడం లేదంటూ ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించారు. దీనిపై స్పందించిన ఎస్టీ కమిషన్ పూర్తి స్థాయి విచారణ జరిపించి, బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్ శశాంకతో పాటు రాచకొండ సీపీ సుధీర్‌బాబుకు ఈనెల 10న నోటీసులు జారీ చేసింది.


National Commission for Scheduled Tribes
NOTICE

జాతీయ ఎస్టీ కమిషన్ నోటీసు

ఉపాధి పనులు భేష్

- జాతీయ కార్యదర్శి అనిల్‌కుమార్
- స్టేట్ కమిషనర్ అనితరాంచందర్‌తో కలిసి రాయపోల్‌లో పర్యటన

ఇబ్రహీంపట్నం: క్షేత్రస్థాయిలో ఉపాధి పనుల నిర్వహణ బాగుందని గ్రామీణాభివృద్ధి శాఖ జాతీయ అదనపు కార్యదర్శి టీకే అనిల్‌కుమార్, రాష్ట్ర శాఖ కమిషనర్ అనితరాంచందర్ అన్నారు. రాయపోల్ గ్రామంలో కొనసాగుతున్న పనులను శనివారం వారు పరిశీలించారు. పనికి తగిన వేతనం చెల్లిస్తున్నారా, పని ప్రదేశంలో తాగునీరు, నీడ వంటి సదుపాలయాలు కల్పిస్తున్నారా? అని సిబ్బందిని అడిగారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం ద్వారా కొనసాగుతున్న కూలీల హాజరును పరిశీలించారు. అనంతరం రాయపోల్ అటవీ ప్రాంతంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ అమ్మ పేరు మీద మొక్క నాటి, సంరక్షించాలని సూచించారు. వీరి వెంట అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, స్పెషల్ ఆఫీసర్ షఫీయుల్లా, జాయింట్ కమిషనర్ నర్సింహులు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, ఏపీడీలు సక్రియానాయక్, చరణ్‌గౌతమ్, సీఆర్‌డీ ప్రోగ్రాం ఆఫీసర్లు మురళి, కృష్ణమూర్తి, అంబేద్‌ఖాన్, ఎంపీడీఓ వెంకటమ్మ, ఏపీఓ తిరుపతిచారి ఉన్నారు.



మొక్క నాటుతున్న కేంద్ర గ్రామీణాభివృద్ధి అదనపు కార్యదర్శి అనిల్‌కుమార్, అధికారులు

రైతు సంక్షేమమే 'మహీధర' లక్ష్యం

- కర్షకులు, వినియోగదారులను అనుసంధానం చేసే సంస్థ
- కాలానికి అనుగుణంగా పంటలు సాగుచేయాలి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి



ఎర్త్‌సెంటర్‌లో మొక్కనాటి నీరు పోస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

కడ్తాల్: రైతు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధి అన్మాస్‌పల్లి గ్రామ ఎర్త్ సెంటర్‌లో మహీధర ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ వాటాదారుల వార్షిక సమావేశాన్ని నిర్వహించారు. మహీధర డైరెక్టర్ ఉపేందర్‌రెడ్డి అతిథులతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పోచారం ప్రసంగించారు. రైతులు, వినియోగదారులను అనుసంధానం చేసే సంస్థ మహీధర అని కొనియాడారు. రైతులకు లాభసాటిగా, వినియోగదారులకు కలుషితం లేని ఆహారం అందించాలన్నదే సంస్థ సంకల్పమన్నారు. కాలానికి అనుగుణంగా పంటలను సాగు చేయాలని సూచించారు. సాగులో రసాయనిక ఎరువుల వినియోగం, పురుగుల మందుల వాడకాన్ని తగ్గించాలని, సేంద్రియ పద్ధతుల ద్వారా నాణ్యమైన ఆహార ఉత్పత్తులను సాధించాలని పేర్కొన్నారు.

ఆర్గానిక్ సేంద్రియ పద్ధతిలో..

సీజీఆర్ సంస్థ పర్యావరణ పరిరక్షణకు పాటుపడటం ప్రశంసనీయమని పాట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎల్.నరసింహారెడ్డి కొనియాడారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. ఆర్గానిక్ సేంద్రియ పద్ధతులతో వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలని సూచించారు. వాణిజ్య పంటలు సాగు చేసే విధానాలపై రైతుల్లో చైతన్యం తీసుకురావాలని చెప్పారు. అనంతరం స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ఎర్త్‌సెంటర్‌లో పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పలువురు మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి, జమ్ముకశ్మీర్ మాజీ డీజీపీ భూపాల్ రెడ్డి, సీజీఆర్ చైర్ పర్సన్ లీలాలక్ష్మారెడ్డి, ఉద్యానవన మాజీ కమిషనర్ వెంకట్‌రామిరెడ్డి, వ్యవసాయ విశ్వ విద్యాలయం మాజీ డైరెక్టర్ రాజిరెడ్డి, ప్రొఫెసర్ విష్ణువర్ధన్‌రెడ్డి, వ్యవసాయ శాస్త్ర వేత్త ఎల్లారెడ్డి సీజీఆర్ వ్యవస్థాపకుడు లక్ష్మారెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే సతిమణి కసిరెడ్డి మాధవి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు హన్మానాయక్, బీచ్యానాయక్, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్ మహీధర సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'చిలుక' బాధ్యతల స్వీకరణ



గడ్డిఅన్నారం మార్కెట్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మధుసూదన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం/అబ్దుల్లాపూర్‌మెట్: గడ్డి అన్నారం పండ్ల మార్కెట్ నూతన చైర్మన్‌గా నియమితులైన చిలుక మధుసూదన్‌రెడ్డి శనివారం బాటసింగారంలోని మార్కెట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ ఆయనకు చార్జ్ అప్పగించారు. ఈ సందర్భంగా మార్కెట్ సిబ్బంది మధుసూదన్‌రెడ్డిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిని వారివారి కార్యాలయాల్లో కలిసి, కృతజ్ఞతలు తెలియజేశారు. మధుసూదన్‌రెడ్డి వెంట పాలకవర్గం సభ్యులు ఉన్నారు.



మంత్రి తుమ్మలను కలిసి కృతజ్ఞతలు చెబుతున్న మధుసూదన్‌రెడ్డి, పాలకవర్గం

సమస్యలు పరిష్కరించండి

- లేదంటే 27నుంచి ఆందోళన చేపడతాం
- కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారికి విన్నవించిన ఏఈఓలు



కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేస్తున్న ఏఈఓలు

ఇబ్రహీంపట్నం రూరల్: క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారుల సమస్యలను పరిష్కరించాలని ఏఈఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాలాల శ్రావన్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ శశాంక, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహా రావును కలిసి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడంతో పాటు, రైతులకు సేవలందిస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రస్తుతం 5 నుంచి 6 రెవెన్యూ గ్రామాలు, 6,500 ఎకరాల సాగు భూములకు ఒక్క ఏఈఓ మాత్రమే ఉన్నారని తెలిపారు. దీంతో పని భారం అధికమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ గ్రామానికి సహాయకుడిని నియమించాలని కోరారు. గతంలోనే తాము పేర్కొన్న సమస్యలన్నింటినీ ఈనెల 26లోపు పరిష్కరించాలని, లేదంటే 27నుంచి ఆందోళన కార్యక్రమాలకు నిర్వహిస్తామని తెలిపారు. ఏఈఓలు శ్రవణ్‌కుమార్, శివాని, రాజేశ్వరి, గౌరిప్రియ, శ్రీయన, రాజు, శ్రీహరి, గీత, అభినవ్, అనూష, వాహిని, శ్రీనాథ్‌రెడ్డి, రమేష్, ప్రియాంక, రాధమ్మ పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి

షాబాద్: భూ సమస్యల కోసం రైతులు పెట్టుకున్న దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూడాలని, అందులో భాగంగా తయారు చేసిన ప్రపోజల్స్‌ను త్వరగా పంపాలని కలెక్టర్ శశాంక అన్నారు. శనివారం ఆయన షాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. భూ సమస్యలు, ధరణి రిజిస్ట్రేషన్లు తదితర వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఇబ్బంది లేకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామాల్లో ఇంటి పన్ను వసూలు చేయాలని, పారిశుద్ధ్యం లోపించకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం, తహసీల్దార్ ఎండీ అన్వర్, ఎంపీడీఓ అపర్ణ, డిప్యూటీ తహసీల్దార్ మధు తదితరులు ఉన్నారు.

ఔటర్‌పై కారు బోల్తా

ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు



శ్రీవల్లి (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: ఔటర్ రింగ్ రోడ్డుపై దూసుకెళ్తున్న కారు.. అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న ఓ యువతి మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సంఘటన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఈసీఐఎల్‌కు చెందిన సాపతి శ్రీవల్లి(23), మేడిశెట్టి శివ, సానిక అనీల్‌లు శుక్రవారం సాయంత్రం నల్లగొండ నుంచి ఈసీఐఎల్‌కు టీఎస్08 జేబీ5647 కారులో ఔటర్‌పై వస్తున్నారు. ఈ క్రమంలో తారమతిపేట వద్దకు రాగానే రాత్రి సుమారు 11గంటల సమయంలో వీరు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి, బోల్తా కొట్టింది. ఈ ఘటనలో శ్రీవల్లి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందగా, శివ, అనీల్‌లు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం యువతి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

హష్ ఆయిల్ విక్రయిస్తున్న నలుగురి అరెస్టు

రూ.21 లక్షల ఆయిల్ స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు, పోలీసుల అదుపులో నిందితులు

నాగోలు: విశాఖపట్నం పరిసర ప్రాంతాల నుంచి హష్ ఆయిల్ తీసుకువచ్చి విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్టుచేసి వారి వద్దనుంచి రూ. 21 లక్షల హష్ ఆయిల్, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. శనివారం ఎల్‌బీనగర్ రాచకొండ సీపీ క్యాంప్ కార్యాలయంలో రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు వివరాలను వెల్లడించారు. సైదాబాద్ కాలనీ చెందిన పూటాల రంజిత్‌కుమార్ అలియాస్ నిఖిల్ అలియాస్ చోటు (29) మీర్‌పేటలో నివాసం ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తునాడు. ఇతనికి వరంగల్ జిల్లాకు చెందిన బొల్లం సాయినితిన్ అలియాస్ సిద్దు(23) విద్యార్థి పరిచయమయ్యాడు.వీరు మీర్‌పేట్, బాలాపూర్, తిరుమల ఎన్‌క్లేవ్ చెందిన బచ్చు నరేంద్ర(23), ఎల్‌బీనగర్ పింఢి నారాయణరెడ్డి కాలనీ చెందిన బోయినపల్లి సాయికృష్ణ(28)లతో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. రంజిత్‌కుమార్ గతంలో హష్ ఆయిల్ విక్రయించిన కేసులో జైలులకు వెళ్లివచ్చాడు. జైలు నుండి విడుదలయ్యాక స్నేహితులతో కలిసి కారులో ఏపీలోని అన్నవరానికి వెళ్లారు. అక్కడ సాయి వద్ద 2700 గ్రాములు హష్ ఆయిల్ కొనుగోలు చేసి హైదరాబాద్ తీసుకువచ్చారు. సాయి నితిన్ ఇంట్లో నిల్వ చేసి చిన్న చిన్న ప్యాకెట్లలోకి మార్చి విక్రయిస్తున్నారు. ఈ నెల 21 వ తేదీన ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు వచ్చిన సమాచారం మేరకు మీర్‌పేట పోలీసులతో కలిసి రంజిత్ కుమార్, సాయినితిన్, నరేంద్ర, బోయిన్‌పల్లి సాయి కృష్ణలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి (2.3) కిలోల హష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను నుంచి స్వాధీనం చేసుకున్న హష్ ఆయిల్ ధర రూ. 21 లక్షలు ఉంటుందని తెలిపారు. 2.8 కేజీల హష్ అయిల్ తయారు కావడానికి సుమారు 100 కేజీల గంజాయిని ఆకులను వినియోగిస్తారని సీపీ సుధీర్‌బాబు తెలిపారు.

గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు...

బిహార్‌కు చెందిన సంతోష్‌కుమార్ అలియాస్ సంతోష్ ప్రసాద్ (26) మహేశ్వరం, రావిరాల గ్రామంలో నివాసం ఉంటూ కూలిపని చేసు కుంటున్నాడు. అదే రాష్ట్రానికి చెందిన బీరేందర్‌సింగ్(52)కూడా నగరంలోనే ఉంటున్నాడు. సంతోష్ ఆగస్టు నెలలో తన స్వగ్రామానికి వెళ్లి అక్కడ గంజాయి చాక్లెట్‌లను కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తిరిగి వచ్చి నగరంలో విక్రయించడం మొదలుపెట్టాడు. ఈ నెల 20న పోలీసులు గమనించి వారి వద్ద నుంచి 19 గంజాయి చాక్లెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. అలాగే ఈ నెల 16న ఇద్దరు అంతరాష్ట్ర మాదక ద్రవ్యాల వ్యాపారులను పట్టుకొని వారి వద్ద నుంచి 199 గ్రాముల నల్లమందు, 632 గ్రాముల హష్ ఆయిల్, ద్విచక్ర వాహనం, మొత్తం రూ. 7.8 లక్షల సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితులు

నందిగామ: తాళాలు వేసి ఉన్న ఇండ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు శనివారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ నర్సింహరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన కొత్తూరు నారాయణ గూడ కాలనీలో ఈ నెల 18న మధ్యాహ్నం వేళలో రెండు ఇళ్లలో చోరీ జరిగింది. బాల నరేంద్ర, రింకిదేవి ఇద్దరు ఇళ్లు పక్కపక్కనే ఉంటాయి. వీరిరువురు పని నిమిత్తం బయటకు వెళ్లగా.. ఇదే అదనుగా భావించిన దుండగులు తాళాలను పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బంగారు, వెండి ఆభరణాలను అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. వారిని పట్టుకునేందుకు రెండు బృందాలు ఏర్పడి తనిఖీలు మొదలు పెట్టారు. ఇందులో భాగంగా కొత్తూరు రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదస్థితిలో కనపడగా, వారిని అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా నేరాన్ని అంగీకరించారు. నిందితుల్లో ఒకరైన సబీర్ అలియాస్ మహమ్మద్ సబీర్ యూపీకి చెందిన వాడు కాగా.. షేక్ నూర్ ఏపీకి చెందిన వ్యక్తిగా గుర్తించారు. వీరు గతంలో కర్నూల్, బెంగళూరులో నేరాలు చేసి జైలుకు జీవితం గడిపినట్లు తెలిసింది. నిందితుల నుంచి 4 తులాల బంగారు, 13 తులాల వెండి ఆభరణాలతో పాటు ఒక ఐరన్ రాడ్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు. కేసును ఛేదించిన ఎస్ఐ మురళీగౌడ్, ఏఎస్ఐ శ్రీనివాస్ చారి, కానిస్టేబుళ్లు కుమార్, రవి కుమార్‌లను సీఐ నరసింహ రావు అభినందించారు.

రాయితీపై బిందు సేద్యం పరికరాలు

- జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేష్ నాయక్
- రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ఇబ్రహీంపట్నం రూరల్: ఉద్యాన వన పంటలు సాగు చేసే రైతులకు ప్రోత్సాహకంగా సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ (బిందు సేద్యం) పరికరాలను ప్రభుత్వం అందజేస్తుందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేష్ నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు డ్రిప్‌పై 100 శాతం, బీసీలకు 90 శాతం, ఇతరులకు 80 శాతం రాయితీ ఇవ్వనుందని వెల్లడించారు. ఐదు హెక్టార్ల వరకు డ్రిప్‌పై రాయితీ, స్ప్రింకర్లపై 75 శాతం రాయితీ ఒక హెక్టారు వరకు ఇస్తామన్నారు. చిన్న సన్నకారు రైతులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. గతంలో మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న రైతులు వాటా చెల్లించిన తేదీకి అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో చెల్లిస్తామన్నారు. ప్రాంతాల వారీగా రైతులు అధికారులను సంప్రదించాలని సూచించారు. నవీన 8977714219 ఇబ్రహీంపట్నం, యాచారం, బాలాపూర్, అబ్దుల్లాపూర్, హయత్‌నగర్ మండలాలు. కీర్తి కృష్ణ 8977714222 చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, షాబాద్, శేరిలింగంపల్లి, గండిపేట. సౌమ్య 8977714221 అమనగల్, కడ్తాల్, తలకొండపల్లి, మహేశ్వరం, కందుకూరు, శంషాబాద్, రాజేంద్రనగర్. హిమబిందు 8977714220 షాద్‌నగర్, కేశంపేట్, కొత్తూరు, నందిగామ, చౌదరిగూడెం, కొందుర్గు మండలాల అధికారులను సంప్రదించాలన్నారు.

ఆయిల్‌పామ్‌కు ప్రోత్సాహకం

ఆయిల్‌పామ్ సాగు జిల్లాలో 3వేల ఎకరాల్లో లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 1310 ఎకరాలకు ఆయిల్‌పామ్ మొక్కలు మంజూరు కాగా.. అందులో 854 ఎకరాలు వివిధ మండలాల్లో రైతులు సాగు చేస్తున్నట్లు తెలిపారు. త్రికోణ పద్ధతిలో ఎకరానికి 57, చతురస్రకారంలో 50 మొక్కలు నాటుకోవాలని సూచించారు. మొదటి సంవత్సరం ఎకరానికి రూ.11,600, అంతర పంటలకు తొలి ఏడాది నుంచి నాలుగో సంవత్సరం ఎకరానికి రూ.4,200 రాయితీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కోకాపేటలో అక్రమనిర్మాణాల కూల్చివేత



ప్రహరీలను తొలగించిన రెవెన్యూ సిబ్బంది

మణికొండ: గతంలో ఇచ్చిన 60 గజాల పట్టాల స్థలం పోను మిగిలిన అర ఎకరంపైగా ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలపై శనివారం గండిపేట రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. ఏకంగా 10 వరకు నిర్మాణాలను నేలమట్టం చేశారు. కోకాపేట రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 147లో 190 మందికి 60 గజాల ఇంటి పట్టాలను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో కేటాయించారు. అవి కాకుండా మరింత స్థలం మిగిలి ఉంది. దానిపై కన్నేసిన కొందరు ప్రబుద్ధులు నకిలీ పట్టాలను సృష్టించి మున్సిపల్ కార్యాలయంలో ఇంటి నెంబర్లను ఇప్పించి ఒక్కో పట్టాను రూ. 30 లక్షల నుంచి రూ. 50లక్షల వరకు అమ్మకాలు జరిపారనే ఫిర్యాదులు వచ్చాయి. అలా కొనుగోలు చేసిన వారు ఇటీవల అందులో నిర్మాణాలు చేపట్టారు. వాటిపై తహసీల్దార్‌కు ఫిర్యాదు రావటంతో శనివారం వాటిని నేలమట్టం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. దాంతో ఉదయం నుంచే నార్సింగి పోలీసుల భారీ బందోబస్తు మధ్య కూల్చివేతలను చేపట్టారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు కూల్చివేతలను అడ్డుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. కూల్చివేతలకు అడ్డుతగిలితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పటంతో వెనుదిరిగారు. దాంతో వెలసిన అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. విషయం తెలుసుకుని రాష్ట్ర ముదిరాజ్ కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మెన్ బి.జ్ఞానేశ్వర్, టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, నార్సింగి మున్సిపాలిటీ వైస్ చైర్మెన్ విజయ్‌బాబుల ఆధ్వర్యంలో పలువురు కౌన్సిలర్‌లు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని పేదల గృహాలు ఎందుకు కూల్చారని వాదనకు దిగారు.

వీడిన హత్యకేసు మిస్టరీ

నాంపల్లి: అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఓ వ్యక్తి కేసు మిస్టరీని హబీబ్‌నగర్ పోలీసులు ఛేదించారు. అక్కా,తమ్ముడు కలిసి ఆ వ్యక్తిని హత్య చేసినట్లుగా నిర్ధారించారు. దీంతో హత్యకు పాల్పడిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన హబీబ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో 17వ తేదీ అర్ధరాత్రి కురుమబస్తీలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం... ఏ బ్యాట్రీలేన్‌కు చెందిన ఖాజా నిజాముద్దీన్ అలియాస్ ఖాలేద్(60) కురుమ బస్తీలోని తనకు పరిచయం ఉన్న రేణుకా అనే మహిళ ఇంటికి తరచుగా వచ్చి వెళ్తుండేవాడు. ఈ క్రమంలో ఈ నెల 17న అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఆమె ఇంటికి వచ్చాడు. తన కోరిక తీర్చాలని కోరగా ఆమె ఒప్పుకోలేదు. అనంతరం అతని నోటికి టవాల్‌ను చుట్టి మీద కూర్చుని చంపేసింది. అంతటితో ఆగకుండా ఆమె తమ్ముడు ఎం.వెంకటేష్‌ను పిలిచి మృతదేహాన్ని ఇంటి ముందు అరుగుపై పారేశారు. దీంతో పోలీసులు అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఘటనగా కేసును నమోదు చేశారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు విచారించగా అతడు హత్యకు గురైనట్లుగా తేల్చారు. పోలీసుల విచారణలో రేణుక, ఆమె తమ్ముడు ఎం.వెంకటేష్ చంపినట్లుగా ఒప్పుకోవడంతో ఇరువురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నలుగురిపై కేసు నమోదు

రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ప్రొటెక్ట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో తెలిపారు. వార్డెన్‌పై విద్యార్థినులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగారెడ్డి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ప్రొటెక్ట్ ప్రొటెక్షన్ సభ్యులు విద్యార్థినులను విచారించారు. వారి నుంచి పూర్తి నివేదికను స్వీకరించిన అనంతరం రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రొటెక్షన్ అధికారి వెంకటేశ్ శనివారం మధ్యాహ్నం బుద్వేల్ ప్రభుత్వ పాఠశాల వద్దకు వెళ్లి ఉపాధ్యాయుల స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. హస్టల్‌లో ఉంటున్న 43 మంది విద్యార్థినులను నగరంలోని బాలికల సంరక్షణ కేంద్రానికి తరలించినట్లు ప్రవీణ్ కుమార్ తెలిపారు.